Andhra Jyothi Dt. 01/03/2023

# ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ సర్వే పూర్తి

## అలైన్‌మెంట్ కోసం పెగ్ మార్కింగ్ ప్రారంభం




రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ సర్వే ఎట్టకేలకు పూర్తయింది. గతేడాది డిసెంబరు 9న సీఎం కేసీఆర్ ఎయిర్‌పోర్టు మెట్రో పనులకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు, సీనియర్ ఇంజనీర్లు మూడు విడతలుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. రాయదుర్గం రహేజా మైండ్ స్పేస్ జంక్షన్ నుంచి నానక్‌రామ్‌గూడ ఓఆర్‌ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, సవాళ్లను పరిశీలించి ప్రణాళిక రూపొందించారు. రూ.6,250 కోట్ల వ్యయంతో 31 కిలోమీటర్ల మార్గాన్ని పకడ్బందీగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంగళవారం పనులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సర్వే పూర్తయినందున గ్రౌండ్ లెవల్‌లో అలైన్‌మెంట్ కోసం పెగ్ మార్కింగ్ ప్రారంభించినట్లు చెప్పారు. ప్రధాన రహదారిపై సంప్రదాయ ఇంజనీరింగ్ పెగ్ మార్కింగ్‌తో పాటు రాత్రి సమయంలో వాహనదారులకు కనిపించేందుకు రెట్రో రిఫ్లెక్టివ్ షీట్‌తో కూడిన అల్యూమినియం బోర్డులను సెంట్రల్ మీడియన్‌లో పెడుతున్నామని, తద్వారా ఇవి చైనేజీని సూచిస్తాయన్నారు. అంటే ఎయిర్‌పోర్టు మెట్రో ప్రారంభ స్థానం నుంచి ఆ బోర్డు పెట్టిన ప్రదేశం వరకు దూరాన్ని సూచిస్తాయన్నారు. ప్రతి వంద మీటర్లకు 0.1 కి.మీ, 0.2 కిలోమీటర్లు అంటూ చిన్న సైజు బోర్డులు వేస్తున్నామన్నారు. ప్రతి అర కిలోమీటరుకు పెద్ద సైజు బోర్డుల పెడుతున్నామన్నారు.